క్లుప్తంగా

డిజిటల్ రేషన్‌కార్డులను సద్వినియోగం చేసుకోండి

జియ్యమ్మవలస: డిజిటల్ రేషన్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వై.జయలక్ష్మి అన్నారు. ఈ మేరకు ఆమె ఆధ్వర్యంలో అంకవరంలో శనివారం రేషన్ కార్డుల పంపిణీ చేపట్టారు.ఈ సందర్భంగా ఆమె క్యూ ఆర్ కోడ్‌తో ఉన్న డిజిటల్ రేషన్ కార్డులను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్డు గుర్తింపు కార్డుగా కూడా ఉపయోగపడుతుందని చెప్పారు. కార్డుల పంపిణీ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఆదర్శపాఠశాల విద్యార్థి ఎంపిక


ప్రమోద్ కుమార్

కురుపాం: జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ చూపిన తమ ఆదర్శపాఠశాల 9వ తగతి విద్యార్థి బి.ప్రమోద్‌కుమార్ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఉల్లకి రామలక్ష్మి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆమె మాట్లాడుతూ ఆదర్శ పాఠశాల నుంచి అండర్–17 విభాగంలో జిల్లా స్థాయిలో పాల్గొని ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికై నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని పీడీ, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

ఐటీఐ కళాశాలలో మెగా జాబ్‌మేళా రేపు

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల వద్ద సోమవారం ఉదయం 10 గంటలకు మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కన్వీనర్, ప్రిన్సిపాల్ శ్రీనివాసచారి ఓ ప్రకటనలో తెలిపారు. అదానీ ఎనర్జీ సొల్యూషన్స్, భగవతి ప్రాడక్స్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారని తెలిపారు. పదవ తరగతి, ఐటీఐ, ఇంటర్మీడియట్, డిప్లమో, డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులు, నిరుద్యోగులను అర్హత ప్రకారం ఉద్యోగాలకు ఎంపికచేయనున్నట్లు పేర్కొన్నారు. జాబ్‌మేళాకు నిరుద్యోగులు సర్టిఫికెట్ల ఒరిజినల్, జిరాక్స్ కాపీలు, బయోడేటా, ఆధార్‌కార్డు, ఫొటో తదితర పత్రాలతో హాజరుకావాలని సూచించారు. విద్యార్థులు, నిరుద్యోగులు ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉల్లాసంగా నందెన్న నిమజ్జనాలు


నేరడిలో నందెన్న నిమజ్జన ఊరేగింపులో సందడి

భామిని: మండలంలో శనివారం సందడిగా గౌరీ సమేత శంకరుడు ఆసీనులైన నందెన్నల నిమజ్జోత్సవాలు కొనసాగాయి. ఈ సందర్భంగా కర్రసాము, కత్తి దండకాలు చేస్తూ ఊరేగింపులు సాగించారు. డప్పు వాయిద్యాలతో ప్రదర్శనలు చేసి నిమజ్జనోత్సవాలు గావించారు. నేరడి–బి.నులకజోడు, గజపతినగరం, భామినిలలో నిమజ్జనోత్సవాలు సాగాయి.

అడుగేస్తే..ప్రభంజనమే..


నిమ్మక శేఖర్

గుమ్మలక్ష్మీపురం: జననేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అడుగేస్తే జన ప్రభంజనమేనని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు నిమ్మక శేఖర్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన గుమ్మలక్ష్మీపురంలో విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 9వ తేదీన విశాఖపట్నం, అనకాపల్లి పర్యటనకు విచ్చేసిన జగన్‌మోహన్ రెడ్డికి మద్దతు ఇస్తూ, కళ్లారా చూసేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివచ్చారని, జనసందోహాన్ని చూసిన కూటమి నేతల గుండెల్లో రైళ్లు పరిగెట్టాయన్నారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా జన సునామీని ఆపలేకపోయారన్నారు. ఎండకు, వర్షానికి బెదరకుండా జగన్‌మోహన్ రెడ్డిని చూసేందుకు ఎగబడిన ప్రజాదరణ వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో రెట్టింపు ఉత్సాహాన్ని ఇచ్చిందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

గోవిందనామస్మరణతో మార్మోగిన తోటపల్లి


అన్నదాన కార్యక్రమం వద్ద భక్తుల సందడి

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం గోవిందనామస్మరణతో శనివారం మార్మోగింది. ఉదయం సుప్రభాతసేవ, అంకురారోపణ, కల్యాణ మంటప పూజ తదితర పూజల అనంతరం స్వామివారికి తిరువీధి నిర్వహించారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాలనుంచి భక్తులు అధికంగా తరలి రావడంతో ఆలయ ప్రాంగణమంతా కోలాహలంగా మారింది.

అనంతరం మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో దాతల సహకారంతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధికంగా పాల్గొన్నారు.

వైద్యకళాశాలల ప్రైవేటీకరణపై ప్రజా ఉద్యమం

- మాజీ ఎమ్మెల్యే కళావతి
- సంతకాల సేకరణకు విశేష స్పందన


సీతంపేట: కోటి సంతకాల సేకరణ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

సీతంపేట:

రాష్ట్రంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై ప్రజా ఉద్యమం తప్పదని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి హెచ్చరించారు. ఈ మేరకు శనివారం మండలంలోని అక్కన్నగూడ గ్రామంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ పోస్టర్లను ఆమె ఆవిష్కరించి చేపట్టిన సంతకాల సేకరణకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా మండల స్థాయి వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో చరిత్రలో నిలిచిపోయే విధంగా 17 మెడికల్ కాలేజీలను తీసుకువచ్చి, ఏడు కళాశాలలు పూర్తి చేశారన్నారు. మిగిలిన కళాశాలల నిర్మాణం దాదాపు 50 శాతం పూర్తిచేసుకున్నాయన్నారు. ఈ కళాశాలల ప్రైవేటీకరణకు చంద్రబాబు కుట్రపన్నారని ఆరోపించారు. దీనికి వ్యతిరేకంగా నవంబరు 22వ తేదీ వరకూ గ్రామ, మండలస్థాయిలో రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించి సంతకాల సేకరణ చేస్తున్నట్లు తెలిపారు. కార్యకర్తలు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొని ప్రజలను చైతన్యం చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ప్రజారోగ్యానికి పెద్ద పీట వేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఆస్పత్రుల ఆధునికీకరణ, విలేజ్ క్లినిక్‌లు, అర్బన్ హెల్త్ సెంటర్లు, అందుబాటులోకి తెచ్చారని గుర్తు చేశారు.

మానవత్వం చాటుకున్న జగనన్న..

కురుపాంలో గురుకుల పాఠశాలకు చెందిన ఇద్దరు గిరిజన విద్యార్థినులు పచ్చకామెర్ల వ్యాధితో మృతిచెందితే ఆ కుటుంబాలకు రూ.5లక్షలు చొప్పున పరిహారం ప్రకటించి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానవత్వం చాటుకున్నారన్నారు. వైద్యసేవలు పొందుతున్న మరికొందరు విద్యార్థులను పరామర్శించడానికి విశాఖ కేజీహెచ్‌కు వెళ్లిన జగనన్నకు కూటమి ప్రభుత్వం పలు ఆంక్షలు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గిరిజన గురుకులాలు, ఆశ్రమపాఠశాలలకు కనీస మౌలికవసతులు కల్పించడంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు ఎస్.లక్ష్మి, సర్పంచ్‌లు రుతోని, కె.వెంకునాయుడు, బి.తిరుపతిరావు, ఎస్.సుశీల, కూర్మారావు, ఎంపీటీసీలు ఎస్.చంద్రశేఖర్, జి.కోటేశ్వరరావు, ఎస్.మంగయ్య, పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు హెచ్.మోహన్‌రావు, పార్టీ నాయకులు ఎస్.రాము, ఎస్.చెంచయ్య, ఎస్.మహేష్, ఎస్.సాయికుమార్, ఎస్.షోడంగ, ఎస్.వెంకీ, ఎస్.రమేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


సంతకాలు చేయిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

మాజీ డిప్యూటీ సీఎం ఆధ్వర్యంలో..

జియ్యమ్మవలస: కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి శనివారం చినమేరంగిలోని తన నివాసంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల నడుమ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని పేద ప్రజలకు ఉచిత వైద్యం అందించాలనే ఉద్దేశంతో 17 వైద్య కళాశాలలను రాష్ట్రానికి తీసుకువచ్చారని, వాటి నిర్మూలనకు కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుందని అన్నారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేయడం దారుణమన్నారు.పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కోటి సంతకాల సేకరణ కురుపాం నియోజకవర్గంలో చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు 40 రోజుల పాటు సంతకాల సేకరణ ఉంటుందన్నారు. సంతకాల సేకరణలో మేధావి వర్గాలు, ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. నవంబర్ 25వ తేదీన జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలో గవర్నర్‌కు కోటి సంతకాల సేకరణను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కోట రమేష్,వైస్ ఎంపీపీ జి.సంపత్‌కుమార్, నాయకులు లోలుగు నారాయణరావు, వివిధ మండలాల ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.


చినమేరంగిలో కోటి సంతకాల సేకరణ వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి

కల్తీ మద్యంపై పోరుకు సిద్ధం కండి

- ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విక్రాంత్, కళావతిలు

పాలకొండ: కూటమి ప్రభుత్వం కల్తీ మద్యం ద్వారా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతిలు ధ్వజమెత్తారు. ఈ మేరకు శనివారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు తక్కువ ధరకే నాణ్యమైన మద్యం అందిస్తామని ప్రకటించారని, అధికారం చేపట్టిన తరువాత మద్యం తనకు ఆదాయ మార్గంగా ఎంచుకున్నారని ఆరోపించారు. వేల కోట్ల రూపాయలు కల్తీ మద్యం ద్వారా సంపాదిస్తున్నారన్నారు. ఎక్కడా లేని విధంగా ఏకంగా కల్తీ మద్యం కేంద్రాలను ఏర్పాటు చేశారని ఆరోపించారు. దీనిపై పోరాటం చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ జగన్‌మోహన‌రెడ్డికి అండగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా ఈ నెల 13న స్థానిక ఎక్సైజ్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టనున్నామని తెలియజేశారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు చేపట్టే ఈ ఆందోళన కార్యక్రమంలో నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రజల పక్షాన పోరాటం చేయాలని కోరారు.

కల్తీ మద్యంపై ప్రత్యేక నిఘా

- ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు


మద్యం దుకాణంలో నాణ్యతను పరిశీలిస్తున్న ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు, సిబ్బంది

కురుపాం: కల్తీ మద్యంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామని కురుపాం ఎక్సైజ్ శాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన సిబ్బందితో కలిసి పలు మద్యం దుకాణాల్లో తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన మద్యం విధానం అమలులోకి వచ్చినప్పటి నుంచి నాణ్యమైన మద్యం అందించేందుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ నిబద్ధతతో పని చేస్తోందన్నారు. ఇందులో భాగంగా గత ఏడాది అక్టోబర్ నుంచి ఈ ఏడాది సెప్టెంబర్ వరకు 78 మద్యం నమూనాలను సేకరించి నివేదికలను తెప్పించామని నివేదికలో ఇచ్చిన వివరాలను బట్టి ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ సరఫరా చేస్తున్న మద్యం నాణ్యమైనదని గుర్తించినట్లు తెలిపారు. ప్రతి నెలా అన్ని షాపుల్లో నమూనాలు సేకరించి పరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులకు ఎవరికైనా మద్యం నాణ్యతకు సంబంధించి ఫిర్యాదులు ఉంటే ఫోన్ నంబర్ 6302936599కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

సుప్రీం కోర్టు న్యాయమూర్తిపై దాడి అమానుషం


నిరసన తెలియజేస్తున్న దళిత సంఘాల నాయకులు

పాలకొండ: సుప్రీంకోర్టు న్యాయమూర్తి బీఆర్ గవాయిపై దాడి అమానుషమని దళిత సంఘాల నాయకులు అన్నారు. ఈ మేరకు శనివారం సాయంత్రం స్థానిక ఎలాం సెంటర్‌లో డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా దళిత సంఘం నాయకుడు బత్తిన మోహనరావు మాట్లాడుతూ దళితులకు రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తిపైనే దాడి జరిగిందంటే దళితులకు ఉన్న రక్షణ ఎంతమేరకో అర్థమవుతోందన్నారు. దాడి చేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జి.రవికుమార్, వై.రాజుకుమార్, జామి అనిల్, పి రమేష్ రాయి రామకృష్ణ, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే కేసులు నమోదు

పాలకొండ రూరల్: ట్రాఫిక్ నిబంధనలను అనుసరించకుంటే కేసులు నమోదు చేస్తామని ఎస్సై ప్రయోగమూర్తి స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం పాలకొండ–సీతంపేట రహదారిలో వాహన తనిఖీలు చేపట్టారు. అధికలోడు, మితిమీరిన వేగం, సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహన చోదకులకు అవగాహన కల్పించారు. పలువురికి అపరాధరుసుం విధించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే సంబంధిత వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

డీడీ ఎఫ్ఏసీ బాధ్యతలు తప్పించడం అన్యాయం

సీతంపేట: పార్వతీపురం మన్యం డీడీ ఎఫ్ఏసీగా విధులు నిర్వహిస్తున్న కృష్ణవేణిని ఆ బాధ్యతల నుంచి తప్పించడం అన్యాయమని ఆదివాసీ సేవా సొసైటీ నాయకుడు మూటక రవికుమార్ ఒక ప్రకటనలో ఖండించారు. నిరంతరం గిరిజన విద్యాసంస్థలు పర్యవేక్షిస్తూ, విద్యార్థుల బాగోగులను చూస్తున్న గిరిజన మహిళ కృష్ణవేణిని బాధ్యతల నుంచి తప్పించి ఆమెకంటే జూనియర్‌ను ఇక్కడ నియమించడం తగదన్నారు. ఎటువంటి తప్పుచేయకపోయినప్పటికీ కేవలం గిరిజన మహిళ అనే చిన్న చూపుతో ఆ పోస్టు నుంచి తప్పించడం సరికాదన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం

కురుపాం: మండలంలోని ఏగులవాడ గ్రామంలో ఆర్క్స్ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్క్స్ సంస్థ కో ఆర్డినేటర్ ఎస్.చిరంజీవి గ్రామంలోని ఆడపిల్లలకు బాలికల విద్య, ఆరోగ్యం, వ్యక్తిగత ఆరోగ్యం, జాగ్రత్తల గురించి వివరించారు. అలాగే గ్రామంలో ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించిన అనంతరం ఆడపిల్లలకు మెప్యాడ్ మైడ్ కార్యక్రమంలో భాగంగా శానిటరీ నాప్‌కిన్స్ పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో ఆర్క్స్ సిబ్బంది ఎం.సూర్యం, బి.రాధమ్మ, వలంటీర్ బి.సౌజన్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికలు తెలివిగా మెలగాలి

భామిని: బాలికలు తెలివిగా మెలగాలని ఎంఈఓ వి.భాస్కరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక కేజీబీవీలో ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిభవాని ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు గుడ్‌టచ్–బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించిన అనంతరం విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు సర్పంచ్ లోపింటి రాజేష్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కేజీబీవీ ఎస్ఓ భాగ్యవతి, పీఎంసీ కమిటీ సభ్యులు, ఐసీడీఎస్ ఎస్ఓలు కార్యక్రమంలో పాల్గొన్నారు.


కురుపాం: అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ప్లకార్డులు చూపుతున్న విద్యార్థులు


భామిని: విజేతలకు బహుమతులు అందిస్తున్న సర్పంచ్ లోపింటి రాజేష్, ఎంఈఓ భాస్కరరావులు

రాగులతో ఆరోగ్యానికి రక్ష


ఏజెన్సీలో పండించిన రాగుల పంటను చూపుతున్న గిరిజన మహిళ

- పెట్టుబడి తక్కువ..దిగుబడి ఎక్కువ
- చోడి సాగుపై రైతుల్లో పెరుగుతున్న ఆసక్తి

భామిని:

చిరుధాన్యాల్లో భాగమైన రాగుల సాగుపై విస్తృత ప్రచారంతో గిరిజన ప్రాంతాల్లో రాగుల పంట పండించడంపై రైతుల్లో ఆసక్తి పెరుగుతోంది. ప్రస్తుతం రాగుల నారు పోసి నాట్లు వేసే కాలం ఆసన్నమైంది. రుతుపవనాలు అనుకూలించడంతో రాగుల సాగు చేపట్టారు. జిల్లాలో సుమారు రెండు వేల ఎకరాల వరకు చోడి సాగవుతోంది. అందులో పాలకొండ డివిజన్‌లోనే 500 ఎకరాలు వరకు అత్యధికంగా సాగు చేస్తున్నారు.

బలవర్ధక ఆహారం

రాగుల్లో ప్రోటీన్లు, కాల్షియం, ఇనుము, మెగ్నీషియం, నియాసిస్, అధికంగా ఉండడం వల్ల ఆరోగ్యానికి మేలు చేస్తుంది.పీచు పదార్థాలు, విటమిన్లు, జింక్, ఫోలిక్ యాసిడ్, ఫాస్పరస్, తగిన మోతాదులో ఉంటాయి. రాగిసంకటి, రొట్టె, జావ, బిస్కెట్లు, అట్టు లాంటి పుష్టికరమైన పదార్థాలు తయారు చేసుకోవచ్చు. ఇటీవల కాలంలో రాగి ఉత్పత్తులకు గిరాకీ ఉన్నందున ఆరుతడి పంటగా దీన్ని పండించవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. సాగుకు పెట్టుబడి తక్కువ కావడం, అధిక దిగుబడి రకాలు రావడంతో సాగుపై రైతుల్ల ఆశక్తి పెరుగుతోంది.

రెండు కిలోల విత్తనం అవసరం

నీరు నిల్వ ఉండే నేలలు మినహా ఇతరత్రా అన్ని రకాల భూముల్లో రాగి పంట వేసుకోవచ్చు. నాలుగు సెంట్లలో రెండు కిలోల విత్తనాలతో పెంచిన నారు ఎకరాకి సరిపోతుంది. అదే వెదజల్లే పద్ధతి అయితే ఎకరాకి నాలుగు కిలోలు విత్తన రాగులు అవసరం. కిలో విత్తనానికి 2 గ్రాముల కార్బండిజమ్ లేదా 3 గ్రాముల మాంకోజెబ్‌తో విత్తనశుద్ధి చేసుకోవచ్చు. 25 రోజుల లేతనారు సాళ్ల మధ్య 15 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 10 సెంటీ మీటర్లు దూరం ఉండేలా నాటుకోవాలి. ఎకరాకు నాలుగు టన్నుల పశువుల ఎరువు వేసుకోవాలి. ఎకరాకి 12 కిలోల భాస్వరం, 20 కిలోల యూరియా, 20కిలోల పొటాష్, నారు నాటే సమయంలో వేసుకోవాలి. నాటిన 30 రోజులకు మరోసారి ఎకరానికి 25 కిలోల యూరియా వేయాలి. రాగిలో ప్రతి 8 వరుసలకు ఒకటి, రెండు వరుసలు కందిని అంతర పంటగా సాగు చేసుకుంటే అదనపు ఆదాయం వస్తుందని వ్యవసాయ అధికారులు తెలియజేస్తున్నారు.


ఇంటిలో నిలువ చేసిన చోడి వెన్నులు


గిరిజన ప్రాంతాలలో ముమ్మరంగా సాగుతున్న రాగుల నాట్లు

ఆదాయం ఎక్కువగా ఉంటుంది..



ప్రస్తుతం అధిక దిగుబడులను ఇచ్చే రాగి రకాలు అందుబాటులో ఉన్నాయి. వకుళ, సప్తగిరి, కల్యాణి వంటి తెల్ల గింజ రకాలను ఎంపిక చేసుకోవాలి.100 నుంచి 115 రోజుల్లో పంట చేతికి వస్తుంది. ఎకరాకి సగటున వర్షాధారంగా ఐదారు క్వింటాళ్ల దిగుబడి వస్తుంది, మిశ్రమ పంటగా సాగు చేయవచ్చు. కొండ ప్రాంతాల్లోనూ నీరు నిలబడని ప్రాంతాల్లో సాగు కొనసాగుతోంది. గిరిజన ప్రాంతాల్లో చోడి సాగు విస్తీర్ణం పెంచుతున్నాం. పౌష్టికాహారంగా రాగిమాల్ట్ ఉపయోగం పెరుగుతోంది. ప్రతి ఇంటిలో చోడి వాడకం పెరిగింది. మార్కెట్‌లో రాగి పిండితో చేసిన ఆహారానికి భలే గిరాకీ ఉంది. దీంతో పంటకు గిట్టుబాటు ధర వస్తోంది.

–కె.రత్నకుమారి, ఏడీఏ, పాలకొండ

మాజీ ఎమ్మెల్యే పరామర్శ


మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: సీతంపేట ఉపసర్పంచ్ బృందావతి మామయ్య పాలవలస ఆదినారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి శనివారం పరామర్శించారు. మృతుడి కుమారుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పాలవలస ప్రకాశరావును ఓదార్చారు. అన్నివిధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ విక్రాంత్ నివాళులు

పాలకొండ: పట్టణానికి చెందిన రాజకీయ నాయకుడు పైడి సత్యప్రసాద్ పార్థివ దేహానికి ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ శనివారం నివాళులర్పించారు. సత్యప్రసాద్ గుండె పోటుతో శుక్రవారం ఢిల్లీలో మరణించారు. ఆయన పార్థివ దేహాన్ని శనివారం పాలకొండ పట్టణంలో ప్రజల సందర్శనార్థం ఉంచారు. ఈ సందర్భంగా విక్రాంత్ సత్యప్రసాద్ అత్యక్రియల్లో పాల్గొని ఆయన కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.


సత్యప్రసాద్ పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు


సత్యప్రసాద్ పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

సత్యప్రసాద్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ స్పీకర్

పాలకొండ: జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పైడి సత్యప్రసాద్ కుటుంబాన్ని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం శనివారం పరామర్శించారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామికి పూజలు

వీరఘట్టం: స్థానిక వట్టిగెడ్డ పక్కన వెలసిన అయ్యప్పస్వామి సన్నిధానంలో శనివారం రాత్రి మాలాధారణ చేసిన అయ్యప్ప భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. యజ్ఞకర్త ఎస్‌వీఎల్.ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో విఘ్నేశ్వరుడు, సుబ్రహ్మణ్యస్వామి, దుర్గాదేవి, ఆంజనేయస్వామికి అష్టోత్తర శతనామావళి పూజలు చేశారు.